క్లుప్తంగా

దివ్య మకర జ్యోతి..



భట్టిప్రోలు: భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల్లో శనివారం రాత్రి దివ్య మకర జ్యోతి దర్శన భాగ్యంతో భక్తులు పులకించిపోయారు. భట్టిప్రోలులో రథం సెంటర్, ఐలవరంలో మెయిన్ రోడ్డులో సంక్రాంతి పర్వదినం సందర్భంగా మకర జ్యోతి ప్రజ్వలన నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. స్వామియే శరణం అయ్యప్ప నామ స్మరణతో పురవీధులు మారుమ్రోగాయి. అయ్యప్ప మాలధారులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మకర జ్యోతిని వీక్షించి పులకింతులయ్యారు.

18న కానిస్టేబుల్ పరీక్ష మోడల్ టెస్ట్

రేపల్లె: అఖిల భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 18న పట్టణంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో పోలీసు కానిస్టేబుల్ పరీక్ష మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు నవీన్, లక్ష్మణరావు సోమవారం తెలిపారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యావేత్త కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయంలో లేదా 63003 83130 నంబరుకు సంప్రదించాలని కోరారు.

19న విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

భట్టిప్రోలు: ఏపీ సీపీడీసీఎల్ తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు.. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు తెనాలి చెంచుపేటలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో జరగనున్న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని రేపల్లె ఏడీఏ ఎన్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షికఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై విశాఖ పట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ మూడు రోజులు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

అభిప్రాయాలు తెలపాలి

రేపల్లె రూరల్: విద్యుత్ సమస్యలపై తెనాలి చెంచుపేటలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించబడునని ఆ శాఖ ఈఈ చిరంజీవి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల.. జూనియర్ బాలికల కళాశాలగా అప్‌గ్రేడ్ కావడంతో పూర్వ విద్యార్థి, గ్రామానికి చెందిన మాచవరపు వెంకట్రావు రూ.70వేలు విలువ చేసే 3 కంప్యూటర్లను సోమవారం అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు హరికృష్ణ కంప్యూటర్లను స్వీకరించారు. తన తల్లి మాచవరపు రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఈ కంప్యూటర్లను అందించినట్లు దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమ సుందరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పులిమి కుసుమకుమారి, తదితరులు ఉన్నారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: వాహనం అదుపుతప్పి కింద పడడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన జంగ్రాజుపల్లి సుబ్బయ్య(44) గుంటూరు మిర్చి యార్డులో కూలీ పనులకు వెళుతుంటాడు. ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై చెంచుపేట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతుండగా, ఆర్సీఎం చర్చి కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో వాహనం అదుపుతప్పింది. సుబ్బయ్య కిందపడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆనందాల సంక్రాంతి..

- ఘనంగా పండుగ సంబరాలు
- పెద్దల స్మరణ.. పిల్లలకు ఆశీర్వచనం
- ఉత్సాహంగా ఆటలు, ముగ్గుల పోటీలు
- ప్రత్యేక పూజలు..భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కర్లపాలెం: నల్లమోతువారిపాలెంలో ముగ్గుల పోటీలు



ప్రత్యేక అలంకారంలో శ్రీ అడెమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బూరుగులమ్మ అమ్మవారు

పిట్టలవానిపాలెం: సూర్యభగవానుడు తన నిత్య గమనంలో ఒక్కొక్క రాశిని దాటుకుంటూ.. మకర రాశిలో ప్రవేశించడమే మకర ''సంక్రమణం'' అదే మకర సంక్రాంతిగా జరుపుకుంటారు. జీవరాశి పోషకుడైన సూర్యనారాయణుడి ఆశీస్సులతో సకల ప్రజానీకానికి భిక్షపెట్టి, వారి క్షుద్బాధ తీర్చే రైతన్న ఇల్లు ధాన్య రాశులతో కళ కళలాడే సమయంలో చేసుకునే సంక్రాంతి పండుగను మూడు రోజులు ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం.. చిన్నారులకు, మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, అలకాపురం, అల్లూరు తదితర ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం, అల్లూరు, ప్రాంతాలకు చెందిన కొందరు వివిధ దేశాల్లో వ్యాపార, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సంక్రాంత్రికి వారంతా తమ స్వగ్రామాలకు విచ్చేసి బంధు మిత్రులు, కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు...

రేపల్లె రూరల్: సంక్రాంతి సందర్భంగా.. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 6, 7వ వార్డుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్ రెడ్డి శంకర్, ఆదర్శ వేదిక కన్వీనర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రేపల్లె: సంక్రాంతి, కనుమ సందర్భంగా రేపల్లె పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారు, వేణుగోపాల స్వామి, చెన్నుమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గ్రామ దేవతల గ్రామోత్సవం

భట్టిప్రోలు: సంక్రాంతిని పురస్కరించుకుని భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామ దేవత శ్రీ అడెమ్మ అమ్మవారికి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామోత్సవం కావించారు. భట్టిప్రోలు గ్రామ దేవత శ్రీ దండిపార్వతి అమ్మవారు పుర వీధులలో ఊరేగి దేవాలయానికి చేరుకుంది. అమ్మవారి గ్రామోత్సవంలో గ్రామానికి చెందిన ఆర్టీవో కొలుసు కృష్ణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నిర్వాహకులు వంగర బాబూజీ, మద్దుల వెంకట రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు సన్మానం

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలో జరిగిన క్షత్రియ సంక్రాంతి సంబరాల్లో పలువురు ప్రముఖులను సోమవారం సన్మానించారు. పిట్టలవానిపాలెం సీతారామచంద్రస్వామి దేవాలయం అర్చకులు శ్రీనివాసాచార్యులు దంపతులను ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్కే జుబేర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం భాస్కర్‌రావు, ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావు, సామాజిక ఆరోగ్య కేంద్రం గైనకాలజిస్ట్ జరీనా పర్వీన్‌కు పుష్పగుచ్ఛాలందించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ అధినేత వేగేశన నరేంద్ర వర్మరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు

కర్లపాలెం: మండలంలోని దుండివారిపాలెంలో సంక్రాంతి సందర్భంగా రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. దమ్మన వారిపాలెంలో మహిళలకు తాడులాగుడు, యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. యాజలిలో వాలీబాల్, ముగ్గుల పోటీలు జరిగాయి. నల్లమోతువారిపాలెంలో కబడ్డీ, ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నగరం మండలంలో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనుమ రోజున పశు పోషకులు పశువుల కొమ్ములకు రంగులు వేశారు.



క్షత్రియ సంబరాల్లో పలువురికి సన్మానం



బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ



ఎద్దులబండి తోలుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు..

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- ఉర్దూ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తదితరులు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మండలంలోని కనగాల గ్రామం మండల పరిషత్ పాఠశాల (స్పెషల్ ఉర్దూ)లో నాడు–నేడు పథకం ద్వారా రూ.38 లక్షల వ్యయంతో.. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎంపీ మోపిదేవి సోమవారం శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తూ..రూపురేఖలు మారుస్తున్నారని కొనియాడారు. ఆంగ్ల మాధ్యమాన్ని ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. పేద విద్యార్థులకు చేరువ చేశారన్నారు. దీనితో పాటు ముస్లిం విద్యార్థుల కోసం ఉర్దూ పాఠశాలలనూ..అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ సమ్మద్, కో–ఆప్షన్ సభ్యుడు ఫరూక్, సర్పంచ్ షేక్ రజియా, ఎంపీటీసీలు నాగజ్యోతి, షేక్ అస్మా, పైనం ఏడుకొండలరెడ్డి, చెన్ను కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్‌రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, తురిమెళ్ల శ్రీధర్, అఖిల, తిరుమలరావు, కొతరపు గణేష్, సచివాలయ కన్వీనర్ సుభాని, కరిముల్లా, హాజీ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ నవీన్‌కుమార్, హెచ్ఎం జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి తెప్పోత్సవం



శ్రీ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం



ఐలవరంలో రంగనాయకస్వామి కల్యాణోత్సవం



భట్టిప్రోలులో చిన్నారులకు భోగిపండ్లు

- లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో హోరెత్తిన అల్లూరు
- పాల్గొన్న బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి
- ముగిసిన ధనుర్మాస మహోత్సవాలు

అల్లూరు(పిట్టలవానిపాలెం): మండలంలోని అల్లూరులో శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం నరసింహస్వామిని తెనాలి–నిజాంపట్నం కాలువలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో రెడ్లపాలెం నుంచి నిజాంపట్నం లాకుల వరకు తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ జొన్నలగడ్డ ప్రకాశరావు మాట్లాడుతూ.. అల్లూరు శివారు రెడ్లపాలెంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించి, తిరిగి దేవాలయానికి చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, అర్చకులు వేదాంతం మురళీ మోహన్, పోలిరెడ్డి, అక్కల వెంకటరెడ్డి, ఏడుకొండలరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి హారతి అందించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

తెప్పోత్సవంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

నరసింహస్వామి తెప్పోత్సవంలో బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి, బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి పాల్గొని, స్వామివారికి పూజలు నిర్వహించారు.

చిన్నారులకు భోగిపళ్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు శ్రీవాసవి అమ్మవారి దేవస్థానంలో శ్రీ జనార్దనస్వామి సేవా సమితీ ఆధ్వర్యంలో ధనుర్మాస సందర్భంగా శనివారం రాత్రి చిన్నారులకు భోగిపళ్లు పోశారు. శ్రీ గోదాదేవి సమేత రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవంలో పలువురు దంపతులు పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఐలవరంలో ముగిసిన ధనుర్మాసోత్సవాలు

భట్టిప్రోలు మండలం ఐలవరంలో సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. గోదా రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవంలో అందె చంద్రమౌళి, రాజేశ్వరి దంపతులు పాల్గొనగా, పూజా కార్యక్రమాలను అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి, అనంతాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. 1200 మంది అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, టీటీడీ, దాస సాహిత్య ప్రాజెక్ట్ ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల అధ్యక్షులు గట్టిపాటి నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కేబీవీ రమణ, వి.కోటేశ్వరరావు, ఎం. రంగారావు, దీవి సుజాత, గుంటి మౌనిక, జంజనం జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి



పట్టుబడిన కోడి పందేల నిర్వాహకులు..

నగరం: మండలంలోని తోటపల్లిలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. తోటపల్లిలో కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేపట్టినట్లు తెలిపారు. నలుగురిని అరెస్ట్ చేసి, రెండు కోడి పుంజులు, రూ.1820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైన జూదం, కోడి పందేలు నిర్వహిస్తే.. పోలీసుల దృష్టికి తీసుకునిరావాలని ఎస్ఐ కోరారు.

అదుపులో ఐదుగురు

కర్లపాలెం: మండల పరిధిలోని సమ్మెటవారిపాలెం శివారులో కోడి పందేల స్థావరంపై సోమవారం దాడులు చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. పోలీసుల రాకను గమనించిన పందెం నిర్వాహకులు పుంజులతో పరారయ్యారని, ఒక పుంజు దొరికినట్లు తెలిపారు. రూ.1105లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే.. రెండు మొబైల్స్ మిస్సింగ్ కేసులు.. ట్రేస్ చేసి ఫోన్లు బాధితులకు అందజేసినట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ.లక్ష విరాళం

తెనాలిఅర్బన్: మహాత్మా గాంధీ శాంతి సేవా వృద్ధాశ్రమ నిర్మాణానికి దాతలు జమిలి లక్ష్మీ దేవి, కోట ప్రసాదబాబులు రూ.లక్షను విరాళంగా ఇచ్చారు. వాటికి సంబంధించిన చెక్కులను తెనాలిలో సోమవారం ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి అందజేశారు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి



కొల్లూరు : విద్యుదాఘాతానికి గురై కౌలురైతు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని దోనేపూడి పరిధిలోని పంట పొలాల్లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కిష్కిందపాలేనికి చెందిన కొల్లి వెంకటేశ్వరరావు (46) దోనేపూడి సమీపంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన వెంకటేశ్వరరావు మధ్యాహ్నమైనా.. ఇంటికి చేరుకోకపోవడంతో అతని సోదరుడు వెళ్లి చూడగా.. పొలం మధ్యలో విద్యుత్ స్తంభం వద్ద పడి ఉన్నాడు. తెగిపడి ఉన్న విద్యుత్ వైర్ల వెంబడి అతను పడిపోయి ఉండటాన్ని గమనించి బంధువులకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలుపుదల చేయించారు. కౌలు రైతు మృతి సమాచారం అందుకున్న విద్యుత్తు శాఖ ఏఈ కె.సుధాకర్‌బాబు పోలీసులతో ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలికి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో కిష్కిందపాలేనికి చెందిన రైతులు, బంధువులు కౌలు రైతు మృతికి నష్ట పరిహారం అందజేయాలని ఏఈని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించిన ఏఈ రూ.5 లక్షల పరిహారం అందజేస్తామని సమాధానం ఇచ్చారు. అయితే..రూ.20లక్షల పరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. మృతదేహాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తరలించి ఆందోళన చేశారు. దీనిపై ఏఈ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కొల్లూరు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్‌తో కలసి ఆందోళన చేస్తున్న రైతులు, బంధువులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. విద్యుత్తుశాఖ ఎస్ఈ, డీఈ వచ్చి పరిహారం, ఉద్యోగం విషయంలో స్పష్టత ఇచ్చేవరకు కదిలేదిలేదని.. మృతదేహంతో తెనాలి–రేపల్లె రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతు కుటుంబానికి భరోసా..

కౌలు రైతు కొల్లి వెంకటేశ్వరరావు (46) కుటుంబానికి పరిహారం విషయంలో ఆర్డీఓ పార్థసారథి, మంత్రి మేరుగ నాగార్జున భరోసానిచ్చారు. మృతుడి బంధువులు, గ్రామస్తులతో నష్టపరిహారంపై ఆర్డీఓ చర్చించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.10లక్షల పరిహారం, జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు.. ఉన్న అవకాశాలను పరిశీలించి మృతుడి భార్యకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా మంత్రి మేరుగ నాగార్జున దృష్టికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనంగా రూ.3 నుంచి రూ.5లక్షల పరిహారం అందేవిధంగా చూస్తానని మంత్రి చెప్పారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు పరిహారం విషయం చెప్పి, సర్ది చెప్పారు. అనంతరం వారు ఆందోళన విరమించి, మృతి దేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు సహకరించారు.

డాక్టర్ శ్రీనివాసరాజు దంపతులకు సత్కారం



మెమెంటో అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంతెన తదితరులు

పిట్టలవానిపాలెం: వైద్యుడు దేవుడితో సమానం.. అనే పదానికి నిలువెత్తు నిదర్శనం ఆర్థోపెడిక్ డాక్టర్ శ్రీనివాసరాజు అని బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు కొనియాడారు. మండలంలోని అలకాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సేవా సంస్థ గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో డాక్టర్ శ్రీనివాసరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. సొంత ఊరిని మరిచిపోకుండా.. శుభకార్యానికి వచ్చినా.. డాక్టర్ శ్రీనివాసరాజు వైద్యసేవలందిస్తున్నారని మంతెన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలకాపురం గ్రామాభివృద్ధికి గ్రామ యువకులతో కలిసి శ్రీకారం చుట్టామని నరసింహస్వామి సంఘ నిర్వాహకులు వెంకటపతిరాజు తెలిపారు. అప్పట్లో రూ.2 లక్షలు వసూలు చేసి ఎమ్మెల్యేగా ఉన్న మంతెన అనంతవర్మరాజుతో మాట్లాడి.. గ్రామానికి తాగునీటి సమస్యను తీర్చినట్లు చెప్పారు. దేవాలయాలు, ఫంక్షన్ హాలు నిర్మాణాలు చేపట్టి గ్రామాభివృద్ధి విషయంలో తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటపతిరాజు, ఖాజీపాలెం డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ కూసంపూడి రామరాజు, ఆర్‌కే ఎడ్యుకేషన్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వి.కిషోర్ కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ మురళీధరరాజు, అలకాపురం గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, పిట్టలవానిపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోకరాజు మూర్తిరాజు, అలకాపురం మాజీ సర్పంచ్ మంతెన సుబ్బరాజు, మంతెన సత్యనారాయణరాజు, పెనుమెత్స అచ్యుతరామరాజు తదితరులు ఉన్నారు.

ముగిసిన ధనుర్మాస వ్రతమహోత్సవాలు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతినిత్యం మేలుకొలుపు, గోదారంగనాథులకు సాలిగ్రామాన అభిషేకాలు జరిపారు. బాలస్వామీజీ విశేషంగా పూజలు జరిపారు.